

ప్రభుత్వాస్పత్రి అప్‌గ్రేడ్

ఇల్లెందు ప్రభుత్వ హాస్పిటల్‌ను 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 8లో



తల్లిపాలే అమృతం

తల్లిపాలు చిన్నారులకు విలువైన పోషకాలను అందిస్తాయి. అంతేకాక రోగ నిరోధక శక్తిని కూడా పెంచుతాయి. 8లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అశ్వారావుపేటకు డిగ్రీ కళాశాల



ఎమ్మెల్యేకు జీఓ ప్రతి అందిస్తున్న కేసీఆర్

అశ్వారావుపేటరూరల్ : అశ్వారావుపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తూ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సీఎం కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు జీఓ ప్రతిని సీఎం కేసీఆర్ అందజేశారు. దంతో 20 ఏళ్ల కల సాకారం అయినట్టయింది. ఈ ఏడాది నుంచి అడ్మిషన్లు స్వీకరించి, తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మెచ్చా ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని పలు ప్రధాన సమస్యలపై సీఎంకు వినతిపత్రం అందించారు.

14 మంది ఎస్సైల బదిలీ

కొత్తగూడెంటౌన్: జిల్లాలో 14 మంది ఎస్సైలను బదిలీలు చేస్తూ పోలీస్ శాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఎం.శ్రావణ్‌కుమార్‌ను ఐటీ సెల్‌కు, కొత్తగూడెం సీసీఎస్‌లో ఉన్న పోటు గణేష్‌ను దుమ్ముగూడెం ఎస్సై–1గా, వీఆర్‌లో ఉన్న ఎస్‌కే రవూఫ్‌ను ఇల్లెందు ఎస్సై –1గా, వీఆర్‌లో ఉన్న టి.వెంకటప్పయ్యను కొత్తగూడెం ఓఎస్‌డీ ఆఫీస్‌కు, ఎస్‌కే మదార్‌ను కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్సై–2గా, సీహెచ్ వెంకటేశ్వర్లును లక్ష్మీదేవిపల్లి ఎస్సైగా, ఎం. అప్పారావును ఇల్లెందుకు, కె.సత్యనారాయణరాజును కొత్తగూడెం పీసీఆర్‌కు, అబ్దుల్ రవూఫ్‌ను కొత్తగూడెం వన్‌టౌన్‌కు, ఇల్లెందు ఎస్సై జి.విజయలక్ష్మిని భద్రాచలం టౌన్‌కు, భద్రాచలం టౌన్‌లో ఉన్న జి.విజయను కొత్తగూడెం వన్‌టౌన్ ఎస్సై –2గా, వీఆర్‌లో ఉన్న గంజి స్వప్నను పాల్వంచకు, దుమ్ముగూడెం ఎస్సై ఆర్.నర్సిరెడ్డిని చర్లకు, కొత్తగూడెం పీసీఆర్‌లో ఉన్న వి. శ్రీనివాసరావును ఏహెచ్‌టీయూ కొత్తగూడేనికి బదిలీ చేశారు.

10 వరకు ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం

కొత్తగూడెంఅర్బన్: ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని ఈనెల 10 వరకు పొడిగించినట్లు జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్నోవేటర్లను గుర్తించి వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొనవచ్చని వివరించారు. ప్రతి పాఠశాల నుంచి కనీసం ఒక్క ప్రాజెక్ట్ అయినా 9100 678 543 నంబర్‌కు వాట్సాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలని సూచించారు.

వరి నాటే విధానంపై శిక్షణ

గుండాల: వరి పంట నేరుగా విత్తే పద్ధతులపై ఆళ్లపల్లి మండలం రాయిపాడులో కేవీకే ఆధ్వర్యంలో గురువారం రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ఆర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 12 కేజీల నానబెట్టిన వరి విత్తనాలను ఎకరం దమ్ము చేసిన పొలంలో నేరుగా డ్రమ్ సీడర్‌తో లేదా మనుషుల సాయంతో వెదజల్లవచ్చని చెప్పారు. నేరుగా చల్లడంతో మోతాదుతో పాటు పంట కాలపరిమితి 15 రోజులు తగ్గుతుందని అన్నారు. ఎకరాకు రూ. 5వేలు ఖర్చు కలిసొస్తుందని వివరించారు. అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలకు పైపాటుగా లీటర్ నీటికి 5 నుంచి 10 గ్రాముల 13–0–45 లేదా 19–19–19 వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని చెప్పారు. ఎకరాకు 25 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ ఎరువులు వేయాలన్నారు. కార్యక్రమంలో వాతావరణ విభాగం పర్యవేక్షకులు ఎం. సుమన్, సర్పంచ్ ఈశ్వరి, మాజీ ఎంపీపీ పెండెకట్ల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస శిబిరం (ఫైల్)



వరదొస్తే బడి బందే!

పునరావాస కేంద్రాలుగా పాఠశాలలు

- ప్రతీ ఏడాది ఏజెన్సీకి తప్పని వరద తిప్పలు
- విద్యార్థుల విలువైన సమయం వృథా
- 'వానాకాలం చదువులు' అంటున్న తల్లిదండ్రులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వానాకాలం చదువులు అనే నానుడి తెలుగు లోగిళ్లలో చాలామందికి తెలిసిందే. అప్పట్లో రేకుల షెడ్లు, పూరిపాకల్లో స్కూళ్లు ఉండేవి. వానాకాలం వస్తే అక్కడ పాఠాలు చెప్పడం సాధ్యమయ్యేది కాదు. బడులు సరిగా నడిచేవి కాదు. దీంతో అరకొరగా సాగే చదువులకు పర్యాయపదంగా వానాకాలం చదువులు అనేవాళ్లు. కానీ కాలం మారింది. పాఠశాలలకు పక్కా భవనాలు వచ్చాయి. వర్షం వస్తే కురిసే గదులు లేవు. ఫ్యాన్లు, లైట్లు, టాయిలెట్లు కూడా ఉన్నాయి. అయినప్పటికీ భద్రాద్రి ఏజెన్సీలో విద్యార్థులు ఇప్పటికీ 'వానాకాలం చదువులు' అనే పరిస్థితుల్లోనే ఉండిపోయారు. ఎగువన కురిసే వర్షాలతో గోదావరికి వరద పోటెత్తితే చాలు పాఠాలు బోధించాల్సిన విద్యాలయాలు పునరావాస కేంద్రాలుగా మారుతున్నాయి. విద్యార్థులతో నిండిపోవాల్సిన తరగతి గదులు ముంపు బాధితులను అక్కున చేర్చుకుంటున్నాయి. ఉద్దేశం మంచిదే అయినా ప్రతీ ఏడాది ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు వరదల సమయంలో బడులకు దూరం కావాల్సి వస్తోంది.

ఏడాదికి రెండుసార్లు..

భద్రాచలం వద్ద సగటున ఏడాదికి రెండుసార్లు గోదావరి వరద నీటిమట్టం ప్రమాదకరంగా 53 అడుగుల పైకి చేరుకుంటోంది. దీంతో దుమ్ముగూడెం, చర్ల, అశ్వాపురం, బూర్గంపాడు మండలాలతో పాటు భద్రాచలం పట్టణంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. ఆయా ప్రాంతాల ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలిస్తారు. ఈ కేంద్రాలు 90 శాతం పాఠశాలల్లోనే ఏర్పాటు చేస్తున్నారు. ప్రాథమిక, ఉన్నత, ఆశ్రమ, గురుకుల, జూనియర్, డిగ్రీ కళాశాల.. పేరు ఏదైనా ఆపత్కాలంలో ముంపు ప్రాంత ప్రజలకు అవే ఆశ్రయం ఇస్తున్నాయి. ఇది నాణేనికి ఒకవైపు అయితే మరోవైపు పునరావాస కేంద్రాల కారణంగా ఏజెన్సీలో ఉన్న విద్యాలయాల్లో పాఠాలు చెప్పడం వీలు కావడం లేదు. శిబిరాలు కొనసాగినన్ని రోజులు విద్యార్థులకు సెలవులు వస్తున్నాయి. గతేడాది ఏకంగా నెల రోజుల పాటు ఈ తరహా సెలవులు రాగా ఈసారి ఇప్పటికే వారానికి పైగా తరగతులు నిలిచిపోయాయి.

చదువులకు ఆటంకం..

అకడమిక్ క్యాలెండర్ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులందరికీ ఒకే విధంగా ఉంటుంది. దానికి తగ్గట్టే విద్యార్థులంతా పరీక్షలకు సిద్ధం కావాలి. ప్రతిభకు సానపెడుతూ ఇతర ప్రాంతాల విద్యార్థులతో పోటీపడాలి. సాధారణంగా మైదాన ప్రాంత విద్యార్థులతో పోల్చితే ఏజెన్సీ విద్యార్థులపైనే విద్యాపరంగా ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉంటుంది. కానీ వరదల కారణంగా ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు ప్రతీ ఏడాది కనీసం 15 రోజుల పాటు స్కూళ్లు, కాలేజీలకు దూరంగా ఉంటున్నారు. ఇటు విద్యార్థులు, అటు బోధన సిబ్బంది ఈ అంశంపై బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు, విమర్శలు చేయకపోయినా.. శిబిరాల ఏర్పాటు కారణంగా విద్యాసంవత్సరానికి నష్టం జరుగుతుందన్నది కాదనలేని వాస్తవం.

శాశ్వత శిబిరాలు ఏర్పాటు చేయాలి..

ప్రతీసారి వరదల సందర్భంగా లోతట్టు ప్రాంత ప్రజలను మిట్ట ప్రాంతాలకు తరలించి ఇళ్లు కట్టిస్తామని హామీ ఇవ్వడం పరిపాటిగా మారింది. వరదల సీజన్ ముగిసిన తర్వాత ఈ హామీని ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ముంపు ప్రాంత ప్రజలకు వానాకాలం ఇబ్బందులు తొలగడం లేదు. మరోవైపు విద్యార్థులు విలువైన సమయం కోల్పోతున్నారు. ఈ రెండు సమస్యలకూ పరిష్కారం చూపేలా ప్రతీ మండలంలో ముంపు సమస్య ఉన్న చోట శాశ్వత ప్రతిపాదికన మల్టీ పర్పస్ భవనాలను నిర్మించాలనే డిమాండ్ వినిపిస్తోంది. సాధారణ రోజుల్లో ఫంక్షన్ హాళ్లుగా, గోడౌన్లుగా, కమ్యూనిటీ హాళ్లుగా ఉపయోగించుకుంటూ.. వరదల సమయంలో సహాయ శిబిరాలుగా వాడుకునేలా నిర్మించాలని ముంపు ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే రైతు వేదికలు పునరావాస కేంద్రాలుగా ఉపయోగపడుతూ పాఠశాలలపై పడుతున్న భారాన్ని కొంత మేర తగ్గిస్తున్నాయి.

భద్రాచలం దగ్గర 53 అడుగులు వస్తే

- చర్ల మండలంలో 14 గ్రామాలు ముంపు ప్రాంతాలుగా ఉన్నాయి. వీరి కోసం 12 చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో రెండు రైతు వేదికలు, ఒక జూనియర్ కాలేజీ, తొమ్మిది చోట్ల పాఠశాలలు ఉన్నాయి.
- దుమ్ముగూడెం మండలంలో ఎనిమిది గ్రామాలు ముంపునకు గురవుతాయి. వీరి కోసం 12 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయగా, అందులో ఒకటి రైతు వేదిక, మిగిలినవి ప్రభుత్వ పాఠశాలలే.
- బూర్గంపాడు మండలంలో ఐదు మేజర్ పంచాయతీలకు ముప్పు. లోతట్టు ప్రాంత ప్రజల కోసం ఏడు పునరావాస కేంద్రాలు ఉండగా ఇందులో ఆరు స్కూళ్లు, ఒకటి మార్కెట్ యార్డు.
- భద్రాచలం పట్టణంలో పదుల సంఖ్యలో ఫంక్షన్ హాళ్లు, హోటళ్లు, డార్మిటరీ, సత్రాలు అందుబాటులో ఉన్నాయి. వీఐపీలు వచ్చినప్పుడయితే ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో ప్రభుత్వం తరఫున కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. కానీ వరదల సమయంలో వీటిని ఉపయోగించడం లేదు. ఎప్పటి నుంచో వస్తున్న అలవాటుగా, కేవలం ప్రభుత్వ పాఠశాలలే పునరావాస శిబిరాలుగా ఉపయోగిస్తున్నారు.

8 నెలల్లోనే శిక్ష ఖరారు..



కనకగిరి అటవీప్రాంతంలో విధి నిర్వహణలో ఉద్యోగులతో శ్రీనివాసరావు (ఫైల్)

- ఎఫ్‌ఆర్‌ఓ హత్యకేసులో తీర్పుపై సర్వత్రా హర్షం
- ఆత్మస్థైర్యం నింపుతుందన్న అటవీ అధికారులు
- ధన్యవాదాలు తెలిపిన శ్రీనివాసరావు సతీమణి భాగ్యలక్ష్మి

చుంచుపల్లి/చంద్రుగొండ : అటవీ రేంజ్ అధికారి చలమల శ్రీనివాసరావు హత్య కేసులో ఎనిమిది నెలల్లోనే నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ కొత్తగూడెం జిల్లా జడ్జి పాటిల్ వసంత్ తీర్పు వెలువరించడంపై సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది. అడవుల సంరక్షణకు ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న సిబ్బందికి ఈ తీర్పు భరోసా కల్పించింది. గతంలో పోడు పోరులో సిబ్బందిపై ఎన్నో దాడులు జరిగినా తక్కువ సమయంలో నిందితులకు శిక్షలు ఖరారు చేయడం ఇదే ప్రథమం. గతేడాది నవంబర్ 22న విధి నిర్వహణలో ఉన్న ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావును చంద్రుగొండ మండలం బెండాలపాడు ప్లాంటేషన్‌లో ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన గొత్తికోయలు మడకం తుల, పొడియం నంగ హతమార్చిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై నాటి చంద్రుగొండ ఎస్ఐ విజయలక్ష్మి, సీఐ వసంత్‌కుమార్ కేసు నమోదు చేయగా, 24 మంది సాక్షులను విచారించిన జడ్జి.. నేరం రుజువు కావడంతో నిందితులకు జీవితఖైదు విధిస్తూ గురువారం తీర్పుచెప్పారు.

కోర్టు తీర్పు హర్షణీయం



ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు హత్య ఘటన అటవీ శాఖను కలచివేసింది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించింది. కేవలం ఎనిమిది నెలల్లోనే నిందితులకు కోర్టు శిక్ష ఖరారు చేయడం హర్షణీయం. ఈ తీర్పు మా సిబ్బందిలో ఆత్మస్థైర్యాన్ని నింపింది. అటవీ సిబ్బంది ఎవరికీ శత్రువులు కారు. మానవ మనుగడ కోసం అడవులను సంరక్షించడమే మా బాధ్యత.

– కిష్టాగౌడ్, డీఎఫ్ఓ

పోలీస్, న్యాయ శాఖలకు కృతజ్ఞతలు



నా భర్త హత్య కేసులో తక్కువ సమయంలో నిందితులకు శిక్ష ఖరారు చేయడం సంతోషంగా ఉంది. అటవీ, పోలీస్ శాఖతో పాటు తీర్పు వెలువరించిన న్యాయమూర్తికి ప్రత్యేక ధన్యవాదాలు. మాకు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది మొదటి నుంచీ అండగా నిలిచారు. సీఎం కేసీఆర్ నేనున్నానని మనోధైర్యాన్ని కల్పించారు. ఉద్యోగంతో పాటు రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం ఇచ్చి అండగా నిలిచిన సీఎంకు రుణపడి ఉంటాం.

– భాగ్యలక్ష్మి, శ్రీనివాసరావు సతీమణి

మాలో మనోస్థైర్యం నింపుతుంది



మా సహచరుడు చలమల శ్రీనివాసరావు హత్య కేసులో న్యాయస్థానం ఇచ్చిన తీర్పు మాలో మనోస్థైర్యాన్ని నింపుతుంది. ఈ తీర్పుతో ఇలాంటి సంఘటనలు పునరావృతం కావని ఆశిస్తున్నా. పోలీసులకు, న్యాయస్థానానికి కృతజ్ఞతలు.

– ప్రసాద్‌రావు, ఇన్‌చార్జ్ రేంజర్, చంద్రుగొండ

తప్పు చేస్తే శిక్ష తప్పదని రుజువైంది



తప్పు చేసే వారికి శిక్ష తప్పదని ఈ తీర్పుతో రుజువైంది. అయితే ఇంత త్వరగా తీర్పు రావడం శుభసూచకం. సోదరుడు శ్రీనివాసరావుకు ఈ రోజే నిజమైన నివాళి.

– ఉమ, రేంజ్ అధికారి, రామవరం

ఘనంగా సువర్ణ పుష్పార్చన

పాల్వంచరూరల్ : మండలంలోని శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. 108 సువర్ణ పుష్పాలతో అర్చన, మంత్రపుష్పం తదితర పూజల అనంతరం నివేదన, హారతి సమర్పించారు. కార్యక్రమంలో వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్ శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు రామలింగం పాల్గొన్నారు.

నష్టంపై కేంద్ర బృందం ఆరా..



బూర్గంపాడు మండలంలో పర్యటిస్తున్న కేంద్ర బృందం సభ్యులు, కలెక్టర్ ప్రియాంక ఆల

- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన సభ్యులు
- రైతులతో మాట్లాడి వివరాల సేకరణ
- కేంద్రానికి నివేదించి న్యాయం చేస్తామని భరోసా

బూర్గంపాడు/అశ్వాపురం : గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో కేంద్ర బృందం సభ్యులు గురువారం పర్యటించారు. బూర్గంపాడులోని పులితేరు, అశ్వాపురం మండలం ఆనందాపురంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి ముంపు వివరాలు, పంటనష్టంపై ఆరా తీశారు. వరదలు వచ్చిన నష్టం వాటిల్లని పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదలతో నష్టపోయిన పంటలు, రహదారులపై కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించి పరి హారం వచ్చేలా చూస్తామన్నారు. గతేడాది కూడా కేంద్ర బృందం పర్యటించినా నేటికీ నష్టపరిహారం ఎందుకు అందించలేదని రైతులు సభ్యులను ప్రశ్నించారు. అనంతరం బూర్గంపాడు కొల్లుచెరువు వద్ద దెబ్బతిన్న రహదారులను కేంద్ర బృందం పరిశీలించగా నష్టం వివరాలను కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల వారికి తెలియజేశారు. వరదలతో 11 మండలాల పరిధిలోని 84 గ్రామాలు ముంపునకు గురయ్యాయని, 44 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 4,454 కుటుంబాలకు చెందిన 14,081 మందిని కేంద్రాలకు తరలించామని వివరించారు. మూడు ఎన్డీఆర్ఎఫ్ టీమ్‌లతో పాటు ఒక హెలికాప్టర్‌ను అందుబాటులో ఉంచామన్నారు. 115 మంది గజ ఈతగాళ్లు, 85 నాటు పడవలను, 5వేల లీటర్ల డీజిల్, 2 వేల లీటర్ల పెట్రోల్‌ను సిద్ధంగా ఉంచామ ని చెప్పారు. 23 మందిని మండల ప్రత్యేకాధికారులుగా నియమించామన్నారు. 103 అవాసాల్లో 11 చోట్ల మిషన్ భగీరథ పైప్‌లైన్లు మరమ్మతులకు గురయ్యాయని, 41 ఇళ్లు పూర్తిగా, 162 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, 44 గ్రామాల్లో 1,402 మంది రైతులకు చెందిన 3,151 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. పీఆర్ రోడ్లు 115, ఆర్‌అండ్‌బీ రోడ్లు 61 మరమ్మతులు గురయ్యాయని వివరించారు. ఈబృందంలో హోం మంత్రిత్వశాఖ సలహాదారు కునాల్ సత్యార్థి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్ డిప్యూటీ సెక్రటరీ అనిల్ గైరోల, సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ రమేష్‌కుమార్, మినిస్ట్రీ ఆఫ్ పవర్ డిప్యూటీ డైరెక్టర్ భయా పాండే, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాసులు, ఆయిల్‌సీడ్స్ డైరెక్టర్ పొన్నుస్వామి, ఐఈఎస్ రీజినల్ అధికారి ఎస్‌కే కుష్వా ఉండగా, ఎస్పీ వినీత్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌రావు, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పీఆర్, మిషన్ భగీరథ ఈఈలు వెంకటేశ్వరరెడ్డి, భీమ్లా, మంగ్యా, తిరుమలేష్, నళిని, డీఏఓ అభిమన్యుడు, ఉద్యాన అధికారి జినుగు మరియన్న, పశుసంవర్ధక అధికారి పురంధర్, తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఏడీఏ తాతారావు పాల్గొన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలన

భద్రాచలం: వర్షాలు, గోదావరి వరదలతో దెబ్బతిన్న పంటలు, ఇతర నష్టంపై ఐటీడీఏలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను బృందం సభ్యులు పరిశీలించారు. కలెక్టర్ ప్రియాంక ఆల, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ వారికి నష్టం వివరాలను తెలియజేశారు.

'మద్యం' రిజర్వేషన్లకు డ్రా



డ్రా నంబర్ చూపిస్తున్న కలెక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): 2023 – 25 సంవత్సరానికి నూతన మద్యం పాలసీ ప్రకారం లక్కీ డ్రా ద్వారా రిజర్వేషన్లను ఎంపిక చేసినట్లు కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. ఐడీఓసీలో గురువారం డ్రా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 88 మద్యం షాపులకు గాను ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు కేటాయించిన 44 దుకాణాలు పోగా, మిగిలిన 44లో 13 షాపులకు డ్రా పద్ధతిలో రిజర్వేషన్లు ఖరారు చేశామని వివరించారు. వీటిలో గౌడ కులానికి 6, ఎస్సీలకు 7 ఎంపిక చేశామన్నారు. గౌడ కులస్తులకు గెజిట్ సీరియల్ నంబర్ 1, 3, 11, 21, 39, 79 దుకాణాలు, ఎస్సీలకు 10, 12, 13, 20, 36, 43, 82 షాపులు ఎంపిక చేసినట్లు తెలిపారు. శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు స్వీకరిస్తామని, ఈనెల 18న సాయంత్రం 6 గంటల వరకు గడువు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ఉమ్మడి ఖమ్మం జిల్లా డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, జిల్లా అధికారి జానయ్య, ఎస్సీ అభివృద్ధి అధికారి అనసూర్య, ఎస్టీ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, బీసీ సంక్షేమాధికారి ఇందిర, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కరంచంద్, ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాత వాటికే కొత్త పూతలు!

- ఊరించి.. ఉస్సూరుమనిపించిన అమృత్ భారత్
- రైల్వే స్టేషన్ సర్క్యులేటింగ్ ఏరియాకే ప్రాధాన్యం
- నూతన పోర్టికో నిర్మాణానికి పెద్ద పీట
- జాడలేని ఏసీ వెయిటింగ్ హాళ్లు, క్యాంటీన్



కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో చేపట్టే అభివృద్ధి పనుల నమూనా

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎంపిక చేసిన రైల్వే స్టేషన్ల అభివృద్ధి కోసమంటూ కేంద్ర ప్రభుత్వం ఊదరగొట్టిన అమృత్ భారత్ పథకం ఊరించి.. ఉసూరుమనిపించింది. ప్రస్తుతం స్టేషన్‌లో ఉన్న నిర్మాణాలకే మరిన్ని హంగులు అద్దడం మినహా కొత్తగా వచ్చిన ప్రయోజనమేమీ లేకుండా పోయింది.

రూ.7.61 కోట్ల ఆదాయం

డోర్నకల్ – మణుగూరు సెక్షన్‌లో ఉన్న భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ శాఖా పరంగా ఎన్ఎస్‌జీ – 4 కేటగిరీలో ఉంది. ఈ స్టేషన్ ద్వారా నిత్యం 8,020 మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ స్టేషన్ నుంచి రైల్వే శాఖకు రూ.7.61 కోట్ల వార్షిక ఆదాయం సమకూరుతోంది. అమృత్ భారత్ పథకం కింద స్టేషన్ అభివృద్ధికి రూ. 25.41 కోట్లు కేంద్రం కేటాయించింది. ఈ నిధులతో చేపట్టబోయే పనులను ఈనెల 6న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో అమృత్ భారత్ పథకంలో భాగంగా భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్‌లో చేపట్టబోయే అభివృద్ధి పనుల వివరాలను రైల్వే శాఖ గురువారం సాయంత్రం విడుదల చేసింది.

రూపురేఖల్లో మార్పు..

అమృత్ భారత్ నిధులతో భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ రూపు రేఖలు మారబోతున్నాయి. దీని కోసం రూ. 5.65 కోట్లు కేటాయించారు. దీంతో పాటు టిక్కెట్ కౌంటర్/ప్లాట్‌ఫామ్‌ల్లోకి వెళ్లే పోర్టికోను అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న పోర్టికో వాహనాలు తిరిగేంత పెద్దగా లేదు. కొత్తగా నిర్మించే పోర్టికో కింద వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఉండదు. ఫలితంగా ఎండ వచ్చినా, వాన పడినా ప్రయాణికులు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్టేషన్‌లోకి వచ్చి వెళ్లే వీలు కలుగుతుంది.

ఎస్కలేటర్లు, లిఫ్ట్‌ల నిర్మాణం..

భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ విశాలమైన ప్రాంగణంలో విస్తరించి ఉన్నా.. ఆటోలు ఆగేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు లేవు. ప్రస్తుతం స్టేషన్ ముఖద్వారం వైపు ఒకే ఎంట్రన్స్ ఉంది. దీని ద్వారానే రాకపోకలు సాగుతున్నాయి. అమృత్ నిధులతో ఇన్, ఔట్‌ల కోసం ప్రత్యేకంగా ఆర్చ్ నిర్మిస్తారు. స్టేషన్ ఆవరణలో బయటకు వచ్చాక వాహనాలు వెళ్లేందుకు సులువుగా, ఆకర్షణీయంగా, అహ్లాదకరంగా ఉండేలా సర్క్యులేటింగ్ ఏరియాను అభివృద్ధి చేయనున్నారు. వీటితో పాటు కొత్తగా స్టేషన్‌లో ఎస్కలేటర్, లిఫ్టులు నిర్మించనున్నారు. ప్లాట్‌ఫామ్‌లపై కొత్త టాయిలెట్ల నిర్మాణం, పాత టాయిలెట్ల ఆధునికీకరణ, కొత్త పైకప్పు తదితర నిర్మాణాలకు రూ. 5.62 కోట్లు కేటాయించారు. అమృత్ నిధులతో సంబంధం లేకుండా ప్రస్తుతం భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్‌లో రూ.7 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు ఇప్పటికే జరుగుతున్నాయి.

బ్రిడ్జికే రూ. 11.08 కోట్లు

'అమృత్' నిధుల్లో రూ.11.08 కోట్లు స్టేషన్‌లో రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జికే కేటాయించారు. ప్రస్తుతం కొత్తగూడెంలో ఉన్న రైల్వే స్టేషన్‌లో రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఉన్నాయి. కుడివైపు ఉన్న వంతెన స్టేషన్ బయట నుంచి మొదలై రెండు, మూడు ఫ్లాట్‌ఫామ్‌లను కలుపుతూ ముందుకెళ్లి, రైల్వే క్వార్టర్ల వైపు ముగుస్తుంది. దీన్ని నాలుగేళ్ల క్రితం నిర్మించారు. ఎడమ వైపు ఒకటి నుంచి రెండో ఫ్లాట్‌ఫామ్‌ను కలిపే వంతెన నిర్మించి 15 ఏళ్లు దాటింది. దీంతో ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తొలగించి కొత్త వంతెన నిర్మించాలని నిర్ణయించారు.

బస్ స్టేషన్‌ను కలిపేలా?

భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్‌లో కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికే రికార్డు స్థాయిలో 'అమృత్' నిధుల్లో సగం కేటాయించారు. అయితే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఎలా నిర్మిస్తారనే నమూనాను రైల్వే శాఖ విడుదల చేయలేదు. దీంతో ఈ నిర్మాణం కూడా స్టేషన్ బయట ఉత్తరం వైపు మొదలై దక్షిణం వైపు రైల్వే క్వార్టర్ల వద్ద ముగుస్తుందనే భావన కలుగుతోంది. ఎందుకంటే ప్రస్తుతం స్టేషన్‌లో కుడివైపున ఉన్న వంతెనను నాలుగేళ్ల కిందట నిర్మించారు. అప్పుడు నిర్మాణ వ్యయం దాదాపు రూ.5 కోట్లు అయింది. ప్రస్తుతం కొత్త వంతెనకు ఏకంగా రూ.11.08 కోట్లు కేటాయించారు. దీంతో స్థానిక అవసరాలకు తగ్గట్టుగా రాబోయే ఫుట్ ఓవర్ బ్రిడ్జి డిజైన్ ఉంటుందనే అంచనాలు నెలకొన్నాయి. అదే జరిగితే రైల్వే స్టేషన్‌లో దిగిన ప్రయాణికులు బస్ స్టేషన్‌కు చేరుకోవడం సులువవుతుంది.

వీటి జాడే లేదు..

భద్రాచలంలో కొలువైన శ్రీరాముడి దర్శనం కోసం రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. అందువల్లే రైల్వేశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ గౌరవ్ యాత్రలో భద్రాచలానికి చోటు దక్కింది. వీరితో పాటు జిల్లాలో విస్తారంగా ఉన్న పరిశ్రమలకు దేశం నలుమూలల నుంచి ఎగ్జిక్యూటివ్‌లు వస్తుంటారు. దీంతో కొత్తగూడెంలో ఉన్న స్టేషన్‌లో ఆధునాతన ఏసీ వెయిటింగ్ హాల్, క్లోక్ రూమ్, రిటైరింగ్ రూమ్, క్యాంటీన్ తదితర సౌకర్యాలకు అమృత్ భారత్‌లో చోటు దక్కుతుందని ఆశించినవారికి అడియాసలే ఎదురయ్యాయి.

క్లుప్తంగా

పూర్తి సమయం విద్యార్థులకే కేటాయించాలి

ఉపాధ్యాయులకు జిల్లా మానిటరింగ్ అధికారి సూచన



మాట్లాడుతున్న నాగరాజశేఖర్

కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయులు పాఠశాలలో పూర్తి సమయాన్ని విద్యార్థుల కోసమే కేటాయించాలని, మొబైల్ ఫోన్లను పూర్తిగా స్విచ్ ఆఫ్ చేసి ఉంచాలని జిల్లా ఎకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ సూచించారు. లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం మండలాల పరిధిలోని ఉపాధ్యాయులకు ఆనందఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న తొలిమెట్టు శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆశావాహ దృక్పథంతో పనిచేస్తే తొలిమెట్టు ఆశించిన స్థాయిలో విజయవంతం అవుతుందన్నారు. ఉపాధ్యాయులకు అనుకూలంగా పీరియడ్ ప్లాన్స్ పుస్తక రూపంలో అందించామని తెలిపారు. ప్రతి పాఠశాలకు ట్యాబ్‌లు సరఫరా చేశామని, ఆన్‌లైన్‌లో చేయాల్సిన పనులు అన్ని ట్యాబుల ద్వారా చేయవచ్చని, మొబైల్ ఫోన్లు ఉపయోగించాల్సిన అవసరం లేదని సూచించారు. కోర్సు డైరెక్టర్ ఎల్.లీల, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

అడవుల జోలికి రావొద్దు

సీసీఎఫ్ బీమానాయక్



ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న సీసీఎఫ్ బీమానాయక్

చంద్రుగొండ: పోడు పేరిట రిజర్వ్ ఫారెస్ట్‌లోకి రావొద్దని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బీమా నాయక్ హెచ్చరించారు. చంద్రుగొండ మండలం రామవరం రేంజ్ పరిధి తిప్పనపల్లి బీట్‌లో 45 హెక్టార్ల ప్లాంటేషన్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు అర్హులుగా ఉన్న పోడుదారులకు ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసిందని తెలిపారు. ఇకపై అడవులను అక్రమంగా నరికినా, ప్రోత్సహించినా చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట డీఎఫ్ఓ కిష్టాగౌడ్, ఎఫ్‌డీఓ అప్పయ్య, రేంజ్ అధికారి ఉమ, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారికి సన్మానం

కొత్తగూడెంటౌన్: జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి(డీవైఎస్‌ఓ) పి.పరంధామరెడ్డిని గురువారం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ కె.మహీధర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డీవైఎస్‌ఓ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ బాధ్యులు కె.మహీధర్, రాసపెల్లి రాజేంద్రప్రసాద్, బరిగేల భూపేష్, పాము నాగేందర్, రుద్రంపూర్ సర్పంచ్ గుమ్మడి సాగర్, జిల్లా యోగా సెక్రటరీ గుమలాపురం సత్యనారాయణ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల మహిళా పురస్కారానికి(పీఎంఆర్‌బీపీ) కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమశాఖ అధికారిణి ఎం.సబిత గురువారం ఒక ప్రకటనలో కోరారు. జాతీయస్థాయిలో, గుర్తింపు పొందిన నిస్వార్థ పనులు చేసిన, అసాధారణ సామర్థ్యం కలిగిన బాలబాలికలు అర్హులని తెలిపారు. క్రీడలు సామాజిక సేవా, సైన్స్ రంగాల్లో అత్యుత్తమ విజయాలు సాధించినవారు, సమాజాన్ని ప్రభావితం చేసే సాంకేతిక పర్యావరణం, కళలు, సంస్కృతి, ఆవిష్కరణలు చేసినవారూ తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఎస్టీఓ ఆఫీసులో పాము

అశ్వారావుపేట: ఎస్టీఓ కార్యాలయంలోకి గురువారం జెర్రి గొడ్డు పాము చొరబడి కలకలం రేపింది. దీంతో ఉద్యోగులు, సిబ్బంది భయంతో బయటకు పరుగులు తీశారు. అనంతరం స్థానిక మెకానిక్ జీవ పామును పట్టుకొని బయటకు తీసుకురావడంతో ఉద్యోగులంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.27 వేలు స్వాహా

ఇల్లెందు: ఆన్‌లైన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానంటూ పట్టణంలోని సబ్ జైలు బస్తీకి చెందిన ఓ రిటైర్డ్ ఆర్మీ జవాన్ కె. శ్రీకాంత్‌ను ఓ వ్యక్తి మోసం చేశాడు. సీఐ టి.కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం... సబ్‌జైలు బస్తీకి చెందిన శ్రీకాంత్ ఏడాది క్రితం ఆర్మీలో జవాన్‌గా ఉద్యోగ విరమణ చేశాడు. మరో ఉద్యోగం కోసం వెతుకుతున్న క్రమంలో ఆన్‌లైన్‌లో తమ కంపెనీలో ఉద్యోగం ఉందని, ఓ వ్యక్తి నమ్మించి సుమారు రూ.27 వేలు స్వాహా చేశాడు. మరికొంత డబ్బు ఇవ్వాలంటూ ఒత్తిడి చేయటంతో అనుమానం వచ్చి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

తల్లి పాలే అమృతం

- శిశువు పుట్టిన గంటలోపే తల్లి పాలివ్వాలి
- అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు

భద్రాచలంఅర్బన్: అమ్మపాలు అమృతం. శరీరానికి పోషకాలు అందించడంతోపాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి. ప్రస్తుత ఉరుకులు, పరుగుల జీవితంలో కొందరు, నిర్లక్ష్యంతో మరికొందరు బిడ్డకు పోతపాలు పడుతుంటారు. దీనివల్ల శిశువు పూర్తి ఆరోగ్యంగా ఉండే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో తల్లిపాల ఉపయోగాలపై అవగాహన పెంపొందించేందుకు ఏటా ఆగస్టు ఒకటి నుంచి 7వ తేదీ వరకు అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జిల్లాలోని 29 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 5 అర్బన్‌హెల్త్ సెంటర్లు, రెండు ఏరియా ఆస్పత్రుల పరిధిలో తల్లి పాల ఆవశ్యకతపై బాలింతలకు వైద్యులు, నర్సులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో 5,792 మంది ప్రసవించారు. ప్రసవం అయ్యాక గంటలోపు తల్లిపాలు పట్టిస్తున్నట్లు వైద్యసిబ్బంది చెబుతున్నారు.

రోజుకు 10సార్లు ఇవ్వాలి

రోజులో బిడ్డకు 8 నుంచి 10 సార్లు లేదా ప్రతి రెండు, మూడు గటలకోసారి తల్లిపాలు ఇవ్వాలి. ఆరు మాసాల తర్వాత రెండేళ్లవరకు తల్లిపాలతోపాటు అనుబంధ ఆహారం కూడా ఇవ్వాలి. బిడ్డను పడుకోబెట్టి, నిలబెట్టి పాల పట్టకూడదని వైద్య నిపుణులు చెబుతున్నారు. పాలిచ్చే సమయంలో కెఫిన్ అధికంగా ఉండే పదార్థాలు, శీతలపానీయాలు తీసుకోకూడదని, ఇది శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని పేర్కొంటున్నారు.



బిడ్డకు ఎంతో ఆరోగ్యం..

తల్లిపాలు పిల్లలను శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మవ్యాధుల నుంచి రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయి. యాంటీబాడీస్ వృద్ధి చెంది ఇన్ఫెక్షన్లు, నిమోనియా, డయేరియా వంటి వాటిని నివారించవచ్చు. ముర్రు పాలు వ్యాధి నిరోధకశక్తిని పెంచడంతో పాటు, శిశువు జీర్ణాశయ అభివృద్ధికి దోహదపడే విటమిన్-ఎ అధిక మోతాదులో అందిస్తాయి. శిశువు మొట్టమొదట విసర్జించే నల్లటి మెకోనియం అనే మలంతో పాటు, పచ్చకామెర్లు కలిగించే బెలురూబిన్ అనే పదార్థాన్ని కూడా త్వరగా విసర్జించేలా ముర్రుపాలు దోహదం చేస్తాయి. బిడ్డకు మొదటి వారంలో కలిగే పచ్చకామెర్లను నివారిస్తాయి. బిడ్డకు పాలిచ్చే తల్లులకు బ్రెస్ట్ కేన్సర్, అండాశయ కేన్సర్ వచ్చే అవకాశాలు తక్కువని, రక్తహీనత, ఎముకల బలహీనత వంటి జబ్బులు రావని, ప్రసవం అనంతరం రక్త స్రావం తగ్గిపోతుందని వైద్యులు వివరిస్తున్నారు.

గర్భిణిగా ఉన్నప్పటి నుంచే పోషక విలువలున్న ఆహారం తీసుకుంటే పాలు పుష్కలంగా వస్తాయని డాక్టర్లు చెబుతున్నారు. పాలు, చేపలు, గుడ్లు, వెల్లుల్లిపాయ, తాజా ఆకుకూరలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలని, ఆహారంలో తీపి పదార్థాలు (స్వీట్లు) తీసుకోకుండా ప్రకృతి సహజంగా లభించే పండ్లు తినాలని సూచిస్తున్నారు.

శిశు మరణాల నివారణ

ఇన్ఫెక్షన్ సోకి, పుట్టగానే కామెర్లు, శ్వాసకోశ వ్యాధులతో ఎక్కువ మంది శిశువులకు మరణాలు సంభవిస్తున్నట్లు యూనిసెఫ్ గుర్తించింది. పుట్టిన అరగంటలోపు తల్లిపాలు తాగిస్తే నెలలోపు సంభవించే మరణాలను తగ్గించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. దీంతో తల్లిపాల ఆవశ్యకతపై గర్భిణులుగా ఉన్నప్పటి నుంచే విస్తృతంగా అవగాహన కలిగిస్తున్నారు.

రోగ నిరోధక శక్తి పెరుగుతుంది



శిశువుకు మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. సాధారణ ప్రసవమైతే పుట్టిన అరగంటలోపు, సిజేరియన్ అయితే నాలుగు గంటల్లోపు తల్లిపాలు పట్టించాలి. ముర్రుపాలు శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతో పాటు, ఇన్ఫెక్షన్ రాకుండా నివారిస్తాయి.

–డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్, నవజాత శిశు వైద్య విభాగం, భద్రాచలం ఏరియా ఆస్పత్రి

అవగాహన కల్పిస్తున్నాం



తల్లిపాల విశిష్టతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఏరియా ఆస్పత్రుల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను వివరిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ జేవీఎల్ శిరీష, డీఎంహెచ్‌ఓ

ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి అప్‌గ్రేడ్..



100 పడకల ఆస్పత్రిగా మారనున్న ఇల్లెందు ప్రభుత్వ హాస్పిటల్

- జీఓ విడుదల చేసిన వైద్య, ఆరోగ్య శాఖ
- ఇక స్థానికంగానే మెరుగైన, అత్యవసర వైద్యం

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ప్రభుత్వ సెక్రెటరీ ఎస్.ఏ.ఎం.రిజ్వీ జీఓ (ఆర్‌టీ –433) విడుదల చేశారు. రూ. 37.50 కోట్ల నిధులు కూడా కేటాయించారు. మూడు నెలల క్రితం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఇల్లెందుకు రాగా, ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని ఎమ్మెల్యే హరిప్రియ విన్నవించారు. దీంతో మంత్రి వైద్య ఆరోగ్యశాఖ నుంచి నివేదిక కోరారు. రోజూ 500 నుంచి 800 మందికి తగ్గకుండా అవుట్ పేషెంట్లు వస్తున్నారని, ఇన్ పేషెంట్ల సంఖ్య కూడా 50 తగ్గకుండా ఉంటుందని టీవీవీపీ కమిషనర్ నివేదికలో పేర్కొన్నారు. తాజాగా సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే హరిప్రియ కలిసి విన్నవించగా వెంటనే ఆదేశాలు వెలువడ్డాయి.

మెరుగైన వైద్యం అందుబాటులోకి..

ఏడాది క్రితం ఇదే ఆస్పత్రిని వైద్య, ఆరోగ్య శాఖ నుంచి వైద్య విధాన పరిషత్‌కు బదలాయించారు. దీంతో వైద్యులు, సిబ్బంది సంఖ్య పెరిగింది. రోగుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. తాజాగా 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కావడంతో సుమారు 30 మంది వైద్యులు, 60 మంది నర్సులు, 40 మంది ఇతర సిబ్బంది వచ్చే అవకాశం ఉంది. స్పెషలిస్టు వైద్యులు, సిబ్బంది నియామకంతో ఇల్లెందులో మెరుగైన వైద్యం అందనుంది. ఇప్పటికే ఇక్కడ గర్భిణులకు, ఎముకలు, కీళ్లు, చెవి, ముక్కు, గొంతు, కంటి, చర్మ సమస్యలకు సైతం ఇక్కడే వైద్యం లభిస్తోంది. అప్‌గ్రేడ్ చేయడంతో ఇంకా నాణ్యమైన, అత్యవసర సేవలు కూడా అందనున్నాయి. రోజూ మూడు షిఫ్టుల ప్రకారం వైద్యులు విధులు నిర్వర్తిస్తారని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు తెలిపారు. కనీసం వెయ్యి మంది ఓపీ, 100 బెడ్‌లకు తగ్గకుండా ఇన్ పేషెంట్లు ఉంటారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలతో పాటు కారేపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ జీఓ విడుదల కావడంపట్ల మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నేతలు కొక్కు నాగేశ్వరరావు, ఎస్. రంగనాథ్, మనోహర్ తివారి, కడకంచి పద్మ, జేకే శ్రీనివాస్, హరికృష్ణ, గిన్నారపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు



ఇల్లెందుకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపును ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు. మంత్రి కేటీఆర్, హరీశ్‌రావులు కృషి, సీఎం కేసీఆర్ ప్రోత్సాహంతో ఒక్కొక్కటి సాధిస్తున్నాం. 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అవడంతో ఉన్నత వైద్యం ఇల్లెందులోనే లభించనుంది.

–హరిప్రియ, ఇల్లెందు ఎమ్మెల్యే

బుగ్గవాగును పరిశీలించిన అధికారులు



బుగ్గవాగును పరిశీలిస్తున్న అధికారులు

ఇల్లెందు: పట్టణంలోని బుగ్గవాగును గురువారం ఈఎన్‌సీ, పబ్లిక్ అండ్ హెల్త్ డిపార్టమెంట్ ఎస్‌ఈ నరసింహారెడ్డి, ఖమ్మం ఈఈ రంజిత్ పరిశీలించారు. టీయూఎఫ్ఐడీసీ, డీఎంఎఫ్ నిధులు రూ. 9 కోట్లతో ప్రకాళన, సుందరీకరణ చేపట్టాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను పరిశీలించారు. చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారీ వర్షాలు పడితే పట్టణానికి ముప్పు లేకుండా వాగు ప్రక్షాళన చేసి రెండు వైపులా రివిట్‌మెంట్, సుందరీకరణ పనులు, ఫెన్సింగ్ చేపట్టనున్నట్లు తెలిపారు. అంతకు ముందు పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు పరిశీలించారు.మున్సిపల్ కమిషనర్ కుమారస్వామి, డీఈ నవీన్, ఏఈ శంకర్, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

గణిత బోధన సామర్థ్యం పెంచుకోవాలి



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

బూర్గంపాడు: గణిత బోధన సామర్థ్యాలను పెంచుకోవాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు కోటేశ్వరరావు సూచించారు. సారపాక జిల్లా పరిషత్ పాఠశాలలో గణిత బోధన సామర్థ్యాల పెంపుపై నిర్వహించిన శిక్షణా శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల కోర్స్ డైరెక్టర్ రమాదేవి, మండల రిసోర్స్ పర్సన్ మోహన్, బాబురావు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

దమ్మపేట: భార్యను వేధించిన వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని చీపురుగూడెం గ్రామానికి చెందిన వెంకటలక్ష్మికి అశ్వారావుపేట మండలం అల్లిగూడెం గ్రామానికి చెందిన మొడియం మహేష్‌తో 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కొద్ది రోజులుగా మహేష్ మద్యానికి బానిసై భార్యపై అనుమానంతో వేధిస్తున్నాడు. పెద్దమనుషులు సర్దిచెప్పినా మార్పు రాలేదు. దీంతో బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

కొత్తగూడెంటౌన్: బెదిరింపులకు పాల్పడిన ఇద్దరు విలేకరుల (సాక్షి కాదు)లపై కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. విలేకరులు దాసరి సాంబయ్య, నర్సింగోజు విష్ణువర్ధన్ ఈ నెల 1వ తేదీ రాత్రి 11 గంటలకు బస్టాండ్ సెంటర్‌లోని ఓ పాన్‌షాపు వద్దకు వెళ్లి, అక్కడ పనిచేస్తున్న ఎస్.కృష్ణప్రసాద్‌ను బెదిరించారు. అనుమతి లేని సిగరెట్లు, గుట్కాలు అమ్ముతున్నారని, తమకు నెలకు రూ.2500 చొప్పున ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరు విలేకరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

సీతారామ ప్రాజెక్టు సాధనే లక్ష్యం

- ఈనెల 10న ఇల్లెందులో జలసాధన సదస్సు
- అఖిలపక్ష సమావేశంలో వెల్లడించిన నేతలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నర్సయ్య, పక్కన నాయకులు

ఇల్లెందు: సీతారామ ప్రాజెక్టు సాధన కోసం ఆందోళనలు ముమ్మరం చేయడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నట్లు అఖిలపక్షం నాయకులు వెల్లడించారు. ఇల్లెందులోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎన్డీ చంద్రన్న వర్గం, ప్రజాపంథా, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్ టీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తదితరులు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సాగునీరు అందించేందుకు ఎత్తిపోతల పథకంగా డిజైన్ చేశామని, తద్వారా ఇల్లెందు నియోజకవర్గం సస్యశ్యామలం చేయనున్నట్లు ప్రస్తుత ప్రభుత్వం వెల్లడించిందని చెప్పారు. రోళ్లపాడు చెరువును రిజర్వాయర్‌గా మార్చి అక్కడి నుంచి బయ్యారం చెరువు, డోర్నకల్, పాలేరు నియోజకవర్గాలకు నీరందిస్తామని ప్రాజెక్టు డీపీఆర్‌లో పేర్కొన్నట్లు చెప్పారు. ఈమేరకు 2016 ఫిబ్రవరి 16న స్వయంగా సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. మొదటి దశగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని 26 మండలాలకు నీరందిస్తామని టెండర్లు పిలిచి.. ఇప్పుడు ఖమ్మం జిల్లా నుంచి ఆంధ్రాకు నీరు తరలించేందుకు రీ డిజైన్ చేయడం సరికాదన్నారు. మూడుసార్లు డీపీఆర్‌లో మార్పులు చేయడంతో ప్రాజెక్టులో కీలకమైన రోళ్లపాడు ప్రాజెక్టు మొత్తంగా కనుమరుగైందని తెలిపారు. ఇక ప్రాజెక్టును శంకుస్థాపన చేసిన చోట కాల్వల ద్వారా నీరు అందిస్తామనడం ఈ ప్రాంత ప్రజలకు అన్యాయం చేసినట్లేనని వెల్లడించారు. ఈమేరకు ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు ఈనెల 10న ఇల్లెందులో సీతారామ ప్రాజెక్టు జల సాధన సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసమావేశంలో సీతారామ ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోవడమే కాక రోళ్లపాడులోనే ప్రాజెక్టు నిర్మించాలనే డిమాండ్‌తో ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు గొని ఐలయ్య, కె.సారయ్య, ఎస్.ఏ. నబీ, పులి సైదులు, ముద్రగడ వంశీ, నగారపు రాములు మాట్లాడగా జె.సీతారామయ్య, తుపాకుల నాగేశ్వరరావు, చాందావత్ రమేష్‌బాబు, ముసలయ్య, బంధం నాగయ్య, యదళ్లపల్లి సత్యం, దేవరకొండ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



మంటల్లో కాలిపోయిన పూరిల్లు

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ పూరిల్లు దగ్ధమైన ఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గుర్రాల చెరువు గ్రామానికి చెందిన సంకుల సత్యనారాయణ పూరింట్లో మధ్యాహ్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు వ్యాపించాయి. ఇల్లు అంటుకుని ఆగ్నికి ఆహుతైంది. సామగ్రి పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.1.50 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుతు తెలిపాడు.

పైదిగూడెంలో..

దుమ్ముగూడెం : మండలంలోని పైదిగూడెం గ్రామానికి చెందిన గడ్డం జోగయ్య ఇల్లు గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఇంటి సామగ్రితోపాటు ధాన్యం, నగదు, పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు, బ్యాంకు పుస్తకాలు మంటల్లో కాలిపోయాయి. కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

మతోన్మాద భావజాలాన్ని తిప్పికొడదాం

ఇల్లెందులో ముగిసిన సైకిల్ జాతా

ఇల్లెందు: కేంద్రప్రభుత్వం తీసుకుని వచ్చిన నూతన జాతీయ విద్యావిధానం ద్వారా విద్యార్థుల్లో మతోన్మాద భావజాలాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారని.. దీన్ని గుర్తించి అంతా కలిసికట్టుగా తిప్పికొట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు లిక్కి బాలరాజు పిలుపునిచ్చారు. గత నెల 25న చర్లలో ప్రారంభమైన ఎస్ఎఫ్ఐ సైకిల్ జాతా గురువారం ఇల్లెందులో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం వారికి అనుకూల అంశాల్లో పుస్తకాల్లో చేర్చాలని ప్రయత్నిస్తోందన్నారు. స్వతంత్ర ఉద్యమకారుల చరిత్రను తొలగించి ఆర్ఎస్ఎస్ సిద్ధాంత కర్త హెగ్డే తదితర చరిత్రను తీసుకొస్తుండడం గర్హనీయమన్నారు. ఇలాంటి విధానాలతో విద్యార్థులకు చదువును దూరం చేయడమే కేంద్రం కుట్రగా తెలుస్తోందని ఆరోపించారు. కాగా, గడిచిన పదేళ్లలో రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థలు, ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఈమేరకు విద్యారంగంలోని సమస్యలను తెలుసుకుని, పరిష్కారం కోసం పాలకులపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈ జాతాను చేపట్టినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవన్‌కుమార్, బుర్ర వీరభద్రం తెలిపారు. నాయకులు కాలంగి హరికృష్ణ, ఎస్.ఏ.నబీ, బయ్య అభిమన్యు, అభిమిత్ర, నాగకృష్ణ, పవన్, రామ్, చరణ్, ప్రవీణ్, వెంకటేష్, అనిల్, శ్రావణ్, శివమణి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన దుండగులు

పాల్వంచరూరల్: దుండగులు ఓ ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన దంతలబోరులో బుధవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా... మండల పరిధిలోని దంతలబోరు, గంగదేవిగుప్ప గ్రామాల మధ్య వెల్లంకి శివరామకృష్ణ ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నాడు. బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి విద్యుత్ సరఫరా అయ్యే తీగలను కట్ చేశారు. అనంతరం వంటగది కిటికీ వద్ద పెట్రోల్ పోసి నిప్పంటించారు. దీంతో కిటికీ పాక్షికంగా దగ్ధమైంది. ప్రమాద ఘటనపై ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలాన్ని ఏఎస్ఐ సుధాకర్ సందర్శించి వివరాలు సేకరించారు. కాగా దొంగలు చేసిన పనా? లేక పాత కక్షల నేపథ్యంలో జరిగిందా ? అనే విషయం తేలాల్సిఉంది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి శ్రీనివాసకుమార్, పినపాక నియోజకవర్గ నేత పున్నం బిక్షపతి, జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు ఇంటిని సందర్శించి బాధితుడిని పరామర్శించారు. దుండగులను కఠినంగా శిక్షించాలని సీఐని ఫోన్ ద్వారా కోరారు.

బెట్టి ఉడత చంపివేత



చనిపోయిన బెట్టి ఉడత

కొత్తగూడెంరూరల్ : అరుదైన, సుందరమైన బెట్టి ఉడతను ఓ వ్యక్తి చంపివేశాడు. ఈ విషయం గురువారం సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగులోకి వచ్చింది. లక్ష్మీదేవిపల్లి మండలం హమాలీ కాలనీలో ఓ వ్యక్తి బెట్టి ఉడతను హతమార్చాడు. ఆకతాయి చేష్టలతో చంపిన ఉడతను పట్టుకుని ఫొటోలు దిగి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా, వైరల్‌గా మారింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు బెట్టి ఉడతను చంపిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని, విచారిస్తున్నట్లు తెలిసింది. నిందితుడి వివరాలు బయటకు పొక్కనీయడం లేదు. ఏపీలోని నల్లమల, శ్రీశైలం వంటి అటవీ ప్రాంతాల్లో ఈ ఉడత ఉంటుందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. గతంలో ఏపీలోని తిరుపతిలో ఈ జాతి ఉడతను చంపినందుకు మూడు నెలల జైలు శిక్ష విధించినట్లు పేర్కొంటున్నారు.

డెంగీ జ్వరంతో ఉపాధ్యాయురాలి మృతి



ఉమారాణి(ఫైల్)

మణుగూరు రూరల్/పినపాక: డెంగీ జ్వరంతో బాధపడుతూ ఓ ఉపాధ్యాయురాలు గురువారం మృతి చెందింది. పినపాక మండలం గడ్డిగూడెం గ్రామానికి చెందిన పోలెబోయిన ఉమారాణి(41) మణుగూరు గురుకుల పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా, కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి డెంగీ జ్వరంతోపాటు మలేరియా, టైఫాయిడ్ కూడా ఉన్నట్లు చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు. పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది.

విద్యార్థిని అదృశ్యం

టేకులపల్లి: డిగ్రీ విద్యార్థిని అదృశ్యంపై గురువారం కేసు నమోదైంది. టేకులపల్లి ఎస్ఐ జి.రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని హచ్చాతండాకు చెందిన డిగ్రీ విద్యార్థిని బుధవారం రాత్రి సమీపంలోని కిరాణ షాపునకు వెళ్లొస్తానంటూ బయటకు వెళ్లి, తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లేదు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.